క్లుప్తంగా

కాలిబాట వంతెనకు స్థల పరిశీలన



వంతెన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎంపీపీ సత్తిబాబు తదితరులు

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామానికి చెందిన రైతుల సమస్యలు పరిష్కరించడానికి కాలిబాట వంతెన నిర్మాణం చేయాలని నిర్ణయించామని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. బుధవారం సర్‌ప్లస్ వైర్ల సమీపంలో ఉన్న మురికి కాలువను ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి ఎంపీపీ పరిశీలించారు. మురికి కాలువ ఆవలి వైపు సుమారు 150 మంది రైతులకు చెందిన 700 ఎకరాల పంట భూములు ఉన్నాయని ఎంపీపీ చెప్పారు. పొలాల నుంచి ధాన్యం రవాణా చేసుకోవడానికి కాలిబాట వంతెన నిర్మించాలని రైతులు కోరడంతో స్థల పరిశీలన చేశామన్నారు. స్థలాన్ని గుర్తించి వంతెన నిర్మాణానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ట్రినిటీలో ఆరోగ్యశ్రీ సదుపాయం



విలేకర్లతో మాట్లాడుతున్న ట్రినిటీ ఆస్పత్రి డాక్టర్లు

సామర్లకోట: మండల పరిధిలో పవర గ్రామంలో నిర్మించిన ట్రినిటీ కార్పొరేట్ ఆస్పత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయడానికి అనుమతి లభించిందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ, వైద్యులు యాళ్ల రాజా, మేకపాటి భరత్, అమృతలు తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఆంకాలజీ, పల్మనాలజీ, యురాలజీ, నెఫ్రాలజీ తదితర విభాగాల వైద్య సేవలు ఉచితంగా పొందొచ్చన్నారు. సమావేశంలో డాక్టర్లు కౌశిక్ హరి, మోహన్ విజయ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే పింఛన్ల పంపిణీ



యండపల్లిలో వృద్ధుడు తిరుపతిరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దయాదీప్తి

కొత్తపల్లి: మండలంలో బుధవారం తెల్లవారుజాము నంచే అన్ని గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు పింఛన్లను ఇంటికి వెళ్లి అందించడంతో లబ్దిదారుల తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

అవినీతి జాడలపై అప్రమత్తంగా ఉండాలి



ఎల్ఐసీలో జరిగే అవినీతిజాడలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: వ్యవస్థాగతంగా ఏమైనా అవినీతిజాడలు, ఇతర అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటివి ఏమైనా తెలిస్తే వెంటనే కేంద్ర నిఘా సంస్థకు తెలియజేయాలని ఎల్ఐసీ మెయిన్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ఎంఎస్ సుబ్రహ్మణ్యం కోరారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా మండలం అరట్లకట్టలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎల్ఐసీ కార్యకలాపాలు గురించి, అవినీతి, అక్రమాలపై నిఘా సంస్థకు ఎలా ఫిర్యాదుచేయాలో ఆయన వివరించారు. ఎల్ఐసీ కాకినాడ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్రరావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ బోడా సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

తుని: పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 25వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించే కల్వర్టు పనులను బుధవారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాముర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ కాసే సుమతి, కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్.. దివిలి జంక్షన్

- నిరంతర ట్రాఫిక్‌తో ప్రజలకు ఇబ్బందులు
- గంటల తరబడి స్తంభిస్తున్న వాహనాలు



దివిలి జంక్షన్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు



దివిలి జంక్షన్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

పెద్దాపురం: సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలోని దివిలి జంక్షన్‌లో నిరంతర ట్రాఫిక్‌తో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విద్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన పెద్దాపురం మండలం దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల ప్రధాన రహదారి తరచూ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటుంది. ఉదయాన్నే పాఠశాల, కళాశాలలకు వెళ్ళాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు రోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్ట ప్రాంతంలోని ప్రధాన రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు, పాలకుల వాహనాలు ఇదే జంక్షన్ నుంచి ప్రయాణిస్తున్నా ఏళ్లగా ఉన్న ట్రాఫిక్ సమస్యను మాత్రం పట్టించుకునే నాథుడు కరవయ్యాడు.

అనధికార ఆక్రమణలతోనే అసలు సమస్య

రోడ్డు విస్తరణ పనుల కోసం పలు దుకాణాల తొలగింపు కోసం మార్జిన్‌లు ఇచ్చినా సంబంధిత అధికారుల పనితీరు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. ఏడు నెలల క్రితం పెద్దాపురం ఎస్ఐ వెలుగుల సురేష్ రోడ్లపై ఏర్పాటుచేసిన దుకాణాలను ఖాళీ చేయించి వెనక్కి జరిపించారు. ఆరు నెలలు గడవకుండానే దుకాణదారులు మళ్ళీ రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికై నా సంబంధిత శాఖాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హామీ తప్ప ఆచరణ శూన్యం



దివిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టి తామన్న గత పాలకుల హామీ ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దుకాణదారులను వెనక్కి జరిగేలా పోలీస్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదికాస్త కొన్ని రోజులు గడవకుండానే అటకెక్కింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

– వట్టికూటి రాజ్‌కుమార్, దివిలి, పెద్దాపురం మండలం

సిబ్బందిని నియమించాం



చంద్రమాంపల్లి(దివిలి) జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు గాను సిబ్బందిని నియమించాం. రోజూ ట్రాఫిక్ పోలీస్‌ను ఏర్పాటుచేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విస్తరణ పనులకు మిగిలిన శాఖాధికారులు ముందుకొస్తే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. దుకాణాలను ముందు జరిపిన వారిపై చర్యలు తప్పవు.

– వెలుగుల సురేష్, ఎస్ఐ, పెద్దాపురం

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు మూలపేట విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కొత్తపల్లి: పిఠాపురంలో ఈ నెల 9వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో మండలంలోని మూలపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు హెచ్ఎం జి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఇటీవల పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ జెడ్పీ పాఠాశాలలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జరిగిన 17 సంవత్సరాల విభాగంలో చోడిపల్లి ప్రియాంక, కాటూరి అభినయ్, 19 సంవత్సరాల విభాగంలో కోనపల్లి సౌమ్య రెడ్డి, బొడ్డు చంద్రశేఖర్‌లు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు హరిబాబు, సునీత, ప్రసన్నకుమార్‌లను సర్పంచి కంబాల మౌనిక, ఎంపీటీసీలు అడ్డా పాప, గోగు లోవకుమారి, సహోపాధ్యాయులు అభినందించారు.

సురక్ష దేశ చరిత్రలో నూతన అధ్యాయం



సామర్లకోట జగనన్న సురక్ష కార్యక్రమంలో మందుల కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశ చరిత్రలోనే నూతన అధ్యాయమని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక నీలమ్మ చెరువు లయన్స్ క్లబ్ భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరంలో జరుగుతున్న వైద్య పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. జగనన్న సురక్షను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. శిబిరంలో 420 మంది వైద్య సేవలు పొందారు. అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్‌చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హాకీ కోచ్ రవిరాజు, హెచ్ఎం గౌరీశంకర్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): క్రీడల్లో రాణించే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్ఎస్ఆర్‌కె మున్సిపల్ పాఠశాల హెచ్ఎం డి.గౌరీశంకర్ పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య హాకీ ఎంపికల్లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల ఇంగ్లీష్ అసిస్టెంట్ కె.కృష్ణవేణి సౌజన్యంతో సమకూర్చిన హాకీ పరికరాలను బుధవారం పంపిణీ చేశారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు, హాకీ కోచ్ రవిరాజు అతిథిగా హాజరై అండర్–14 విభాగంలో కె.దుర్గాప్రసాద్, ఎం.నవ్య, అండర్–17 విభాగంలో పి.గోపి, ఎన్.రాజలహరిలను అభినందించారు. వీరికి రూ.10 వేలతో కొనుగోలు చేసిన హాకీ స్టిక్స్, టర్ఫ్‌షూస్, చిన్‌ప్యాడ్స్, స్టాగిన్స్ పరికరాలు హెచ్ఎం గౌరిశంకర్, రవిరాజు అందజేశారు. ఫస్ట్ అసిస్టెంట్ ఎ.పుష్ప, పీఈటీ ఎస్.సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతతోనే అవినీతికి అడ్డుకట్ట

కాకినాడ రూరల్: దేశంలో అవినీతిని అడ్డుకోవడం యువతతోనే సాధ్యమని విశ్రాంత డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు మేడపాటి వీరెడ్డి, ఓఎన్‌జీసీ హెచ్ఆర్ జీఎం సునీల్‌కుమార్, విజిలెన్స్ సీజీఎం సోమశేఖర్, సీనియర్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పేర్కొన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ సీపీ సెంటరులో ఓఎన్జీసీతో కలిసి సంయుక్తంగా విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ అధ్యక్షతన తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ అభివృద్ధికి అవినీతి అడ్డురాకూడదని అతిథులు పేర్కొని ప్రతిజ్ఞ చేశారు.



విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో పరారీలో ఉన్న పాలిక రమణను అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సారా స్థావరాలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పా రు. ఈ కేసులో పరారైన నురుకుర్తి చక్రధర్, కందిపల్లి బుజ్జిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామన్నారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు



పాదగయ పుష్కరిణి

పిఠాపురం: దసరా మహోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడంతో కలుషితమైన పాదగయ పుష్కరిణిలో నీటిని రెండు రోజులుగా తొలగిస్తున్నారు. పాత నీరు పూర్తిగా తొలగించి కొత్త నీటిని నింపడానికి నాలుగు రోజులు పడుతుందని అప్పటి వరకు పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలు ఉండదని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల స్నానాలకు కుళాయిలు ఏర్పాటు చేశామని భక్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లా మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అండ్ స్పెషలైజ్డ్ అడాప్స్ ఏజెన్సీ కాకినాడ కార్యాలయంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కాంట్రాక్ పద్ధతిన ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారిణి కె.ప్రవీణ్ బుధవారం రాత్రి తెలిపారు. ప్రొటెక్షన్ అధికారి ఇనిస్టిట్యూషనల్ కేర్, ప్రొటెక్షన్ అధికారి నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్, కౌన్సిలర్ ఒకొక్క పోస్టుకు, సోషల్ వర్కర్ (మహిళ), అవుట్‌రీచ్ వర్కర్స్ రెండేసి పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను ధ్రువపత్రాలతో కలిపి మహిళా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని పీడీ ప్రవీణ వివరించారు.

దేవులపల్లి జయంతి వేడుకలు



చంద్రంపాలెంలో దేవులపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి దంపతులు

సామర్లకోట: ప్రముఖ రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి 126వ జయంతి వేడుకలను రావువారి చంద్రంపాలెంలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవులపల్లి విగ్రహానికి ఆదిత్య విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిలి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. వచ్చే జయంతి వేడుకలకు కృష్ణశాస్త్రి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేస్తానని శేషారెడ్డి హామీ ఇచ్చారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవి ర్యాలి ప్రసాద్, సర్పంచ్ సీమల భవాని, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మండ పాక సురేష్, ట్రస్టు గౌరవ అధ్యక్షుడు డేగల సూరిబాబు, కార్యదర్శి శ్రీలమంతుల శ్రీనివాసరావు, హెచ్ఎం భాస్కరకుమార్, హైస్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ సంబరం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆవాల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మాసరమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో బుధవారం కనకదుర్గమ్మ సంబరం ఘనంగా నిర్వహించారు. శిబిరంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై ఊరేగించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ అమ్మవారికి పూజలు చేసి సంబరాన్ని ప్రారంభించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్పులు, మ్యూజికల్ బ్యాండ్, వివిధ రకాల దేవతామూర్తుల వేషధారణలు, అమ్మవార్ల గరగల నృత్యం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య సంబరం ఉత్సాహంగా సాగింది. మాసరమ్మ గుడి నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం, చంద్రశేఖర స్వామి ఆలయం, పాత తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం మీదుగా సంబరం పంచారామ క్షేత్రం ముఖద్వారం వరకూ అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి, భాస్కరరావు, అప్పారావు, బుజ్జి, లోవరాజు, జగదీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగమణి, కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ నెల 9, 10 తేదీల్లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ జి.నాగమణి తెలిపారు. పోటీల వాల్‌పోస్టర్‌ను తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కాకినాడ ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ప్రతి పాఠశాల నుంచి ఒక ప్రాజెక్టు పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస వినీల్, కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, లారీలను సీజ్ చేసినట్టు బుధవారం స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. హైవేపై స్థానిక మినర్వా విద్యా సంస్థల సమీపంలోనూ, రాచపల్లి అడ్డరోడ్డు వద్ద ఐదు టన్నుల ఇసుకను రవాణా చేస్తోన్న ధర్మవరం గ్రామానికి చెందిన నక్కా సోమరాజును, లారీపై 30 టన్నుల ఇసుకను రవాణా చేస్తున్న తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీను అదుపులోకి తీసుకున్నామన్నారు. సీజ్ చేసిన వాహనాలు, నిందితులను ప్రత్తిపాడు ఎస్సైకు అప్పగించినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.



హైవేపై ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

సామర్లకోట: పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితచరిత్రను ప్రతీఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, మేనేజర్ అచ్యుతరాజు, కౌన్సిలర్లు వీరభద్రరావు, కరణం రాజ్‌కుమార్, పితాని కృష్ణ, మర్రి శేషారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి ఆధ్వర్యంలోనూ రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు.

పెద్దాపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శప్రాయమని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. స్థానిక సినిమా సెంటర్, గోలి వారి వీధిల్లోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు

ఆర్డీఓ కార్యాలయంలో

పెద్దాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఆర్డీఓ జె.సీతారామారావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్‌లు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మండల పరిషత్ కార్యాలయంలో..



సామర్లకోటలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

కొత్తపల్లి: మండలంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ప్రసాద్ అమరజీవికి నివాళులు అర్పించారు. డిపూటీ తహశీల్దారు శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనారాయణ అమరజీవికి నివాళులు అర్పించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పిఠాపురంలో..

పిఠాపురం: గొల్లప్రోలు ప్రభుత్వ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వేసిన వివిధ దేశ నాయకుల వేష ధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థిని ఎంపిక

తుని: స్థానిక ఆదిత్య కళాశాలకు చెందిన విద్యార్థిని కలగా తరుణీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎండీ షాహిద్దీన్ బుధవారం తెలిపారు. ఇటీవల నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో తరుణీ ప్రతిభ చూపి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఆమె త్వరలో విజయవాడలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థినిని విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కరస్పాండెంట్ ఎస్ సుగుణారెడ్డి, కోఆర్డినేటర్ బీవీఈఎల్ నాయుడు అభినందించారు.

శ్రీప్రకాష్ విద్యార్థిని..

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థిని పైలా హేమలత ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.వీర్రాజు బుధవారం తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఐదుగురు ఎంపిక కాగా వీరిలో హేమలత ఒకరన్నారు. ఈ నెల 10 వరకూ విజయవాడలో జరిగే శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొంటుందన్నారు. ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన హేమలతను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బాలాజీచెరువు: ఈ నెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను జేసీ ఇలక్కియాకు ఆవిష్కరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి 20వ తేదిన బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.